సాక్షి
కుమురం భీం
సోమవారం, 6, మే, 2024



గుప్పుమంటున్న గుడుంబా!

జిల్లాలో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. ఎన్నికలను అదునుగా చేసుకొని మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో గుడుంబా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. IIIలో▸

కొడుకులు చూస్తుండగానే..



తమ ఇద్దరు కుమారులకు ఈతనేర్పించేందుకు స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లిన ఆ తండ్రి అదే స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ ఊపిరాడక కొడుకుల కళ్లెదుటే మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లాలో చోటు చేసుకుంది. IIలో▸

గరిష్టం/కనిష్టం
43.6 /28.8

వాతావరణం

చాలా వరకు ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వడగాలులు వీస్తాయి. ఉదయం నుంచే వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది.

వరాల.. జాతర



వేదికపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తదితరులు



హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

- కాంగ్రెస్ 'జనజాతర' విజయవంతం
- రాహుల్‌గాంధీ సభకు భారీగా జనం
- ఉమ్మడి జిల్లాను దత్తత తీసుకుంటాం
- సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- తుమ్మిడిహెట్టి, సీసీఐలపైనా హామీ
- బీజేపీపై విరుచుకుపడిన నాయకులు



వేదికపైకి వస్తూ... అభివాదం

నిర్మల్/నిర్మల్‌చైన్‌గేట్: తనకు ఆదిలాబాద్ అంటే ఎంత ఇష్టమో మీకు తెలుసని, తాను పీసీసీ అధ్యక్షుడైన తర్వాత మొదటి కార్యక్రమమే నిర్మల్‌లో చేపట్టానని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. నిర్మల్‌లోని కలెక్టరేట్‌రోడ్డులోని క్రషర్‌గ్రౌండ్‌లో ఆదివారం జనజాతర పేరిట కాంగ్రెస్ నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సభలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతోపాటు సీఎం పాల్గొన్నారు. ఇద్దరు నేతలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వరాలు కురిపించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తనకు ఆదిలాబాద్ అంటే ఎంత ఇష్టమో అందరికీ తెలుసని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడైన వెంటనే నిర్మల్‌లో మోదీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలపై తొలిసారి పోరాడానని గుర్తుచేశారు. ఇంద్రవెల్లిలోనూ కేసీఆర్ సర్కారుకు వ్యతిరేకంగా దళిత, గిరిజన దండోరా నిర్వహించి బీఆర్ఎస్‌పై సమరశంఖం ఊదామని పేర్కొన్నారు.

దత్తత తీసుకుని అభివృద్ధి

ఉమ్మడి ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుని అభివృద్ధి చేసే బాధ్యత సీఎంగా తాను తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి 1.50లక్షల ఎకరాలకు నీరిస్తామని వాగ్దానం చేశారు. ఆదిలాబాద్‌లో మూతపడిన సీసీఐ సిమెంట్ ఫ్యాక్టరీని మళ్లీ తెరిపించే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని చెప్పారు. తాము పదేళ్లు అధికారంలో ఉంటామని, ఆదిలాబాద్‌ను సస్యశ్యామలం చేసి ఇక్కడి రైతులను ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.

తొలిసారి ఆడబిడ్డకు..

గత 70ఏళ్లలో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఏ ఒక్క మహిళకు అవకాశం రాలేదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోనియాగాంధీ ఎట్టి పరిస్థితుల్లో ఆది లాబాద్ నుంచి గోండు ఆడబిడ్డ ఆత్రం సుగుణను పార్లమెంట్‌కు తీసుకెళ్లాలని టికెట్ ఇచ్చారని చెప్పా రు. తమ అభ్యర్థి సుగుణ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదిలి తండాలు, గూడేల్లో తిరుగుతూ ప్రజాపోరా టాలు చేశారని గుర్తు చేశారు. ప్రజాసమస్యలు తెలి సిన సుగుణను లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరా రు. కుమురంభీం, రాంజీగోండు స్ఫూర్తితో ముందుకు సాగుతున్న ఆమెను పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం సాక్షిగా ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతానని హామీ ఇచ్చారు.

రాహుల్‌ను ప్రధానిని చేద్దాం



రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి మనవంతు కృషిచేద్దాం. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని తొలగించి మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావాలని అనుకుంటోంది. అందరి హక్కులు కాపాడేది రాజ్యాంగమే. బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపించమంటే అయోధ్య నిర్మాణాన్ని చూపిస్తోంది. ఎందరో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించిన రాహుల్ గాంధీకే సొంత ఇల్లు లేదు. ఇలా పేదలకు దగ్గరగా ఉండే నాయకుడినే గెలిపిద్దాం.

– సీతక్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి

కొంగుచాచి అడుగుతున్న..



దేశ భవిష్యత్ కోసం కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. కొంగు చాచి అడుగుతున్న. నాకు ఓటేసి గెలిపించాలని కోరుతున్న. ప్రతీఒక్కరు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలి. రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దాం. ఒక గిరిజన బిడ్డను గుర్తించి కాంగ్రెస్ అధినాయకత్వం పార్లమెంట్ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. జీవితంలో కాంగ్రెస్‌ను మరిచిపోలేను. కాంగ్రెస్ కుటుంబాన్ని బలోపేతం చేయడానికి కష్టపడి పని చేస్తా.

– ఆత్రం సుగుణ, ఎంపీ అభ్యర్థి

పదేళ్ల అభివృద్ధి ఏది?



కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు పదేళ్లు పాలించి రాష్ట్రానికి, దేశానికి చేసిన అభివృద్ధి ఏమీలేదు. పదేళ్లముందు కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేసింది. ఆరోగ్యశ్రీ, 104, 108 సేవలు, రైతు రుణమాఫీ భూదాన్ లాంటి కార్యక్రమాలు తీసుకువచ్చింది. ఇప్పటి దాకా ఐదెకరాలలోపు ఉన్న రైతులందరికీ రైతుభరోసా ఇచ్చాం. కేసీఆర్ ఖజానా ఖాళీ చేయడంతోనే పూర్తిస్థాయిలో ఇవ్వలేకపోయాం. ఆగస్టు 15లోపు రైతుల పంటరుణాలు మాఫీ చేస్తాం.

– వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్యే, ఖానాపూర్

సాగు భారమవుతోంది



బీజేపీ ప్రభుత్వంలో డీజిల్, పెట్రోల్, ఎరువులు, విత్తనాల ధరలు పెరగడంతో వ్యవసాయం భారంగా మారింది. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకు అటవీ భూములు ఇవ్వడానికి సిద్ధపడింది. నూటికి 95మంది రైతులు అప్పుల పాలయ్యారు. నేటికీ బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర చట్టం తీసుకురాలేకపోయింది. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి రెండు లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. ప్రస్తుత ఎన్నికలు ఆత్మగౌరవాన్ని కాపాడుకునే ఎన్నికలు.

– ప్రొఫెసర్ కోదండరాం

బీజేపీకి మరో రూపమే బీఆర్ఎస్



బీజేపీకి మరోరూపమే బీఆర్ఎస్. కమలానికి మరోరూపమే కారుగుర్తు. బీఆర్ఎస్‌కు ఓటు వేసినా అది కారు గుర్తుకే వేసినట్లవుతుంది. ఈ సభ బీజేపీకి వణుకు పుట్టించేలా ఉంది. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేస్తానని మాట్లాడుతోంది. రాజ్యాంగాన్ని రద్దు చేస్తే బీజేపీని పాతళంలోకి తొక్కేస్తాం. ఎవరో చేసిన ఫేక్ వీడియో ద్వారా సీఎం రేవంత్‌రెడ్డిని ఇబ్బందులకు గురి చేస్తోంది. అమిత్‌షా రేవంత్‌రెడ్డి వెంట్రుక కూడా పీకలేరు. కేంద్రంలో కాంగ్రెస్‌కు అధిక మెజారిటీ ఇచ్చి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేద్దాం.

– అద్దంకి దయాకర్

మాట్లాడుతున్న అమిత్ షా



అభివాదం చేస్తున్న అమిత్‌షా, పక్కన ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు



కదనోత్సాహం

- బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన అమిత్ షా పర్యటన
- కాగజ్‌నగర్ వికాస్ సంకల్ప్ సభ విజయవంతం
- ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన జనం
- మార్మోగిన జైశ్రీరామ్, భారత్ మాతాకీ జై నినాదాలు



సభకు హాజరైన ప్రజలు

చింతలమానెపల్లి/కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన ఉమ్మడి జిల్లా కమల దళంలో ఉత్సాహం నింపింది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు అమిత్ షా సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంతో కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్పీఎం మైదానంలో ఆదివారం నిర్వహించిన వికాస్ సంకల్ప్ సభకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, కార్యకర్తలు, నేతలు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు అమిత్‌షా వస్తారని ప్రకటించినా గంట ఆలస్యంగా సాయంత్రం 4 తర్వాత ఆయన సభావేదిక వద్దకు చేరుకున్నారు.

నేరుగా వేదికపైకి..

అమిత్ షా పర్యటన కోసం కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ శిశుమందిర్ విద్యాలయం ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. సాయంత్రం 4 గంటలకు పట్టణానికి చేరుకున్న ఆయన నేరుగా రోడ్డు మార్గం ద్వారా ఎస్పీఎం క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సుమారు అరగంటపాటు ప్రసంగించారు. ముందుగా నాగోబాతోపాటు బాసర సరస్వతీ అమ్మవారికి నమస్కారం అంటూ ప్రసంగం ప్రారంభించారు. ఆదివాసీ వీరులు రాంజీగోండు, కుమురంభీం, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీతోపాటు బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్‌ను గుర్తు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని.. రూ.కోట్లు తరలిస్తోంది. జిల్లాలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేయలేదు.. ఎస్పీఎం మూతపడింది..' అంటూ కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీపై ఓ వైపు విమర్శలు చేస్తూనే.. కేంద్ర ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. మంచిర్యాల- వాంకిడి జాతీయ రహదారితోపాటు అనేక సంక్షేమ పథకాలు చేపట్టామని తెలిపారు. మంచిర్యాల - ఆదిలాబాద్ రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావు ఈ సభకు హాజరుకాకపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

మార్మోగిన నినాదాలు

అమిత్‌షా ప్రసంగిస్తున్న సమయంలో ప్రజలు, కార్యకర్తలు భారత్ మాతకీ జై.. జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రతిఒక్కరూ సంఘీభావం తెలపాలని అమిత్ షా కోరడంతో సభికులు కాషాయ కండువాలు ఊపుతూ ఉత్సాహం చూపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని రాహుల్‌బాబా అని సంబోధిస్తూ ప్రసంగం కొనసాగించారు. చలోక్తులతో ఆకట్టుకున్నారు. సభలో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేశ్‌కు మాట్లాడే అవకాశం రాలేదు. కేంద్ర హోంశాఖ మంత్రి ప్రసంగానికి ముందు నగేశ్ మాట్లాడతారని భావించగా.. వేదికపైకి వచ్చిన అమిత్‌షా నేరుగా ప్రసంగించడంతో గోడం నగేశ్‌కు అవకాశం లేకుండా పోయింది.

హాజరైన ఉమ్మడి జిల్లా ప్రముఖులు

సభకు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు జిల్లాల నుంచి బీజేపీ శ్రేణులు తరలివచ్చాయి. బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్‌బాబు, పవార్ రామారావు పటేల్, పాయల్ శంకర్, మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్లు సత్యనారాయణగౌడ్, సుహాసినిరెడ్డి, కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే దండగే..



వంద రోజుల పాలనలో కేంద్ర ప్రభుత్వం ద్వారా సిర్పూర్ నియోజకవర్గానికి రూ.100 కోట్లు మంజూరు చేయించుకున్నాం. ఈ నిధులతో కాగజ్‌నగర్ రైల్వే ఓవర్ వంతెన నిర్మాణం, అండర్ పాస్‌ల నిర్మాణం చేపడుతున్నాం. కాగజ్‌నగర్ నుంచి చింతగూడ, ఈస్‌గాం గ్రామాల వరకు ప్రజలకు ఈ అభివృద్ధి పనులు ఉపయోగపడతాయి. బీజేపీ ఆదిలాబాద్ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపిస్తే మిగిలిన కాలంలో రోజుకు రూ.కోటి చొప్పున రూ.1800 కోట్ల నిధులతో అభివృద్ధి చేయిస్తాం. ఎకరాకు రూ.5 వేల రైతుబంధు అమలు చేయడానికి కాంగ్రెస్‌కు ఐదు నెలల సమయం పట్టింది. రుణమాఫీ చేయాలంటే కాంగ్రెస్‌కు సాధ్యం కాదు. జోలె పట్టుకుని బిచ్చమెత్తుతున్న కాంగ్రెస్‌కు ఓటు వేయడం దండుగ.. పెద్దన్న లాంటి బీజేపీని గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలి.

– పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్యే, సిర్పూర్

అబద్ధాల పునాదులపై..



అమలు చేయలేని హామీలను ఇచ్చి అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. అక్రమాలపై సమాధానాలు ఇచ్చుకోలేని స్థితిలో ఉంది. రియల్ ఎస్టేట్‌లో వేల కోట్ల అక్రమాలపై సమాధానం ఇవ్వలేదు. కడుపు కట్టుకుంటే 40వేల కోట్ల రూపాయలు మిగులుతాయని ముఖ్యమంత్రి చెప్పడం కాంగ్రెస్ తీరును తెలియజేస్తోంది. కాంగ్రెస్ పాలన మొత్తం స్వార్థం, డబ్బులు సంపాదించడంతో నిండిపోయింది. మహిళలు, విద్యార్థులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలను పథకాల పేరుతో మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారు.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే, నిర్మల్

హామీలు మర్చిపోయిన సీఎం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి మర్చిపోయారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు. రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నడు. ఆగస్టులో రుణమాఫీ చేస్తే బ్యాంకులు రుణాలు ఎలా ఇస్తాయి.. రైతులు పనులు ఎప్పుడు చేసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి మరిచి గాడిద గుడ్డు అని వ్యాఖ్యానిస్తున్నారు. గాడిద గుడ్డు కోసం నిన్ను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారా..?

– పాయల్ శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

మోదీకి బహుమతిగా ఇవ్వాలి




గోడం నగేశ్‌ను బీజేపీ ఎంపీగా గెలిపించి నరేంద్ర మోదీకి బహుమతిగా ఇవ్వాలి. ఇక్కడి ప్రజలు బీజేపీ చేస్తున్న అభివృద్ధిని గుర్తించాలి. కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా ఉంది. జిల్లాకు ఇప్పటివరకు ఒక మంత్రి లేదు. విద్యాశాఖ మంత్రి, హోంశాఖ మంత్రి లేకుండా పాలన చేసే ముఖ్యమంత్రి ఎక్కడా లేడు. కాంగ్రెస్ పాలనలో కుటుంబ పాలన ఉంది. కాని బీజేపీలో కుటుంబ పాలనకు అవకాశం లేదు. నరేంద్ర మోదీ పాలనకు ప్రజలు పట్టం కడుతున్నారు.

– పవార్ రామారావు పటేల్, ఎమ్మెల్యే, ముథోల్

ఇంటింటికీ పోల్ చీటీలు

- ఓటర్లకు అందజేస్తున్న బీఎల్‌వోలు
- పోలింగ్ స్లిప్పులపై పూర్తి సమాచారం
- జిల్లాలో 4,56,309 మంది ఓటర్లు



పోలింగ్ చీటీలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి.. ఎన్నికల నిర్వహణపై అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లతోపాటు అవసరమైన ఇతర సామగ్రి సమకూర్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ శాతం పెంచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు పోలింగ్ చీటీలు పంపిణీ ప్రారంభించారు. ఇప్పటికే ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలో బూత్‌స్థాయిలో పోల్ చీటీల పంపిణీ కొనసాగుతోంది. బీఎల్‌వోలు గడపగడపకూ వెళ్లి ఓటర్లకు పోలింగ్ స్లిప్పులు అందజేస్తున్నారు.

ఓటర్ స్లిప్పుపై పూర్తి వివరాలు

ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని అన్ని బూత్‌ల్లో పోలింగ్ చీటీల పంపిణీ చేస్తూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా చైతన్యపరుస్తున్నారు. ఓటర్లకు పూర్తి సమాచారం తెలిసేలా పోలింగ్ చీటీలపై నియోజకవర్గం, ఓటరు పేరు, పోలింగ్ స్టేషన్ నంబర్‌తోపాటు పూర్తి వివరాలు పొందుపరిచారు. నియోజకవర్గంలోని ఓటర్ల సంఖ్య ఆధారంగా ఎన్నికల సంఘం చీటీలను తయారు చేసింది. జిల్లాలో 4,56,309 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,27,208, సిర్పూర్ నియోజకవర్గంలో 2,29,101 మంది ఓటర్లు ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా 676 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సిర్పూర్‌లో 320, ఆసిఫాబాద్‌లో 356 కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, తాగునీరు, దివ్యాంగులకు ర్యాంపులతోపాటు అన్ని రకాల వసతుల కల్పిస్తున్నారు. 85 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులకు హోంఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. జిల్లాలో హోం ఓటింగ్ కోసం 157 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో ఆసిఫాబాద్‌లో 29 మంది, సిర్పూర్‌లో 128 మంది ఇంటి నుంచి ఓటు వేయనున్నారు.

మామిడి రైతు కుదేలు!

- అధిక ఉష్ణోగ్రతలతో రాలిన పూత, పిందెలు
- ప్రభావం చూపిన తేనెమంచు తెగులు
- సగానికి పడిపోయిన దిగుబడి
- ఎకరానికి నాలుగు టన్నులు కూడా రాని వైనం
- జోరుగా కొనసాగుతున్న కోత పనులు
- జిల్లాలో 982 ఎకరాల్లో మామిడి తోటలు



రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ ఏడాది మామిడి రైతులకు నిరాశే మిగులుతోంది. వాతావరణంలో ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గుల కారణంగా అరకొరగా వచ్చిన పూతలు సైతం పూర్తిస్థాయిలో నిలవక దిగుబడి సగానికి పడిపోయింది. కొన్నేళ్లుగా మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులు కాలం కలిసిరాక కుదేలవుతున్నారు. వరుస నష్టాలతో తోటల నిర్వహణ కోసం చేసిన అప్పులు పెరిగిపోతున్నాయి. గతేడాది ఆశించిన స్థాయిలో కాతపూత వచ్చినప్పటికీ సీజన్ ప్రారంభం నుంచి ఈదురుగాలుల కారణంగా తీవ్రంగా నష్టపోయారు. ఈసారి ఆలస్యంగా వచ్చిన పూతలు దిగుబడిపై ప్రభావం చూపాయి.

పడిపోయిన దిగుబడి

జిల్లాలోని రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్ (టి), జైనూర్ మండలాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఉద్యానవనశాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో 982 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం తోట సాగు విస్తీర్ణం పెరుగుతున్నా సాగు చేస్తున్న రైతులకు మాత్రం లాభాలు దక్కడం లేదు. సాధారణంగా జనవరిలో ప్రారంభం కావాల్సిన మామిడి పూతలు ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా నెల రోజులు ఆలస్యమయ్యాయి. మార్చి నుంచి దంచి కొడుతున్న ఎండలతో అధిక శాతం పూత రాలిపోయింది. దీనికితోడు చెట్లకు సోకిన తేనె మంచు తెగుళ్ల కారణంగా మరి కొంతపూత రాలింది. దాని ప్రభావం పిందె, కాతలపై పడింది. వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి సుమారు 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈసారి ఆలస్యంగా వచ్చిన పూతలు, పూత దశలో మబ్బుల కారణంగా సోకిన తేనే మంచు తెగుళ్ల ప్రభావంతో దిగుబడి సగానికి పడిపోయింది. చిన్నచితక కాయలన్నీ కోసినా ఎకరానికి సుమారు 4 టన్నుల దిగుబడి కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

మార్కెటింగ్ కష్టం

జిల్లాలో మామిడి తోటలు అధికంగానే ఉన్నప్పటికీ మార్కెంటింగ్ సౌకర్యం లేదు. జిల్లా నుంచి రైతులు ప్రస్తుతం నాగ్‌పూర్‌లోకి మామిడి మార్కెట్‌కు కాయలు తరలిస్తున్నారు. సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉండే నాగ్‌పూర్‌కు తరలించేందుకు వాహనాల కిరాయి, లోడింగ్, అన్‌లోడింగ్ ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. మార్కెట్‌లో కమీషన్ కటింగ్‌ల పేరుతో రైతులను మరింత దోచుకుంటున్నారు. అందుబాటులో మార్కెటింగ్ సౌకర్యం ఉంటే రైతులకు కాస్త ఊరట లభించే అవకాశం ఉండేది. గత సంవత్సరం వరకు జిల్లా రైతులే మామిడి కాయలను నాగ్‌పూర్‌కు తరలించగా ఈసారి నాగ్‌పూర్, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచే వ్యాపారులు జిల్లాకు వచ్చి మామిడి కాయలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో మామిడి కాయల నాణ్యత పరిమాణం బట్టి కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. సీజన్ ప్రారంభంలో కిలోకు రూ.70 వరకు ధర పలకగా మార్కెట్‌కు మామిడికాయలు పోటెత్తుతుండటంతో ధర క్రమేపి తగ్గుతూ వస్తోంది.

పరిహారం ఊసేది..?

గత సీజన్ ప్రారంభం నుంచే ఈదురుగాలులు మామిడి తోటలను తీవ్రంగా దెబ్బతీశాయి. పూతల దశ నుంచి కాయ కోసే వరకు బలమైన ఈదురు గాలులు వీయడంతో వందలాది ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నాయి. పంటంతా చేతికందే దశలో కాయలన్నీ రాలిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు దెబ్బతిన్న మామిడి తోటలపై సర్వే చేసి నష్టాన్ని అంచనా వేశారు. గతేడాది ఈదురు గాలులు, వడగండ్ల వానలు, అకాల వర్షాలతో జిల్లాలో 283 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. దెబ్బతిన్న తోటలకు పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలు అందించారు. అయితే ప్రభుత్వం ఇంతవరకు రైతులకు పరిహారంగా ఒక్క రూపాయి కూడా అందించలేదు.

దిగుబడి తగ్గింది

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మామిడి తోటల్లో దిగుబడి తగ్గింది. సాధారణంగా ఎకరానికి 8 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈసారి సుమారు 4 టన్నుల వరకు మాత్రమే దిగుబడి వస్తోంది. ఆలస్యంగా వచ్చిన పూతలు పూర్తిస్థాయిలో నిలవకపోవడంతో పిందె తగ్గింది. దాని ప్రభావం దిగుబడిపై చూపుతోంది. గత సంవత్సరంతో పోల్చితే ఈసారి కాస్త పర్వాలేదు. గతేడాది జిల్లాలో ఈదురుగాలుల కారణంగా 283 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతినగా సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు అందించాం. ఇంకా పరిహారం విడుదల కాలేదు.

– ఎంఏ నదీం, జిల్లా ఉద్యానవన అధికారి

క్లుప్తంగా

గుడుంబా స్థావరంపై దాడులు



పోలీసుల అదుపులో నిందితులు

బెల్లంపల్లి: మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఆదివారం నాటుసారా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి నాటుసారా బట్టీని ధ్వంసం చేశారు. 5 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి వినియోగించే 20 కిలోల బెల్లం, 15 కిలోల డీఏపీ, 1200 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకున్నారు. పాత బెల్లంపల్లికి చెందిన మనపల్లి మల్లేశ్, మనపల్లి లింగయ్యను అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం తాళ్లగురిజాల పోలీసులకు అప్పగించారు. దాడుల్లో రామగుండం టాస్క్‌ఫోర్స్ సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో ఒకరి బలవన్మరణం



చరణ్‌కుమార్

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మనస్తాపంతో ఒకరు బలవన్మరణం పొందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల మేరకు లక్సెట్టిపేట మండలం బలరావుపేటకు చెందిన బొప్పు చరణ్‌కుమార్ (31)కు అదే గ్రామానికి చెందిన భవానితో 2020లో వివాహమైంది. దంపతులకు మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల మృతుని భార్య మరొకరితో చనువుగా ఉంటుందని తెలిసి మనస్తాపానికి గురయ్యాడు. ఈ విషయమై ఇటీవల భార్య, మామ వద్ద చర్చకు రావడంతో ఇద్దరూ కలిసి చరణ్‌కుమార్‌ను అసభ్య పదజాలంతో దూషించారు. ఈ క్రమంలో శనివారం రాత్రి టీకానపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని సోదరుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ అధికారంలోకి వస్తే భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పాతమంచిర్యాల: ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశ భవిష్యత్ అంధకారంలో పడుతుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల సీపీఐ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ శ్రమజీవుల హక్కులను హరిస్తోందన్నారు. సంఘ్ పరివార్ శక్తుల ఎజెండాలో పాలన సాగుతోందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియంతపాలన సాగించిందని, ప్రజాస్వామ్య విలువలకు పాతర వేసిందన్నారు. ఫోన్‌ట్యాపింగ్‌తో దిగజారుడు రాజకీయాలు చేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్నారు. ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి ఖలిందర్ అలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి..



- పారిశ్రామిక జిల్లాపై భానుడి నిప్పుల వాన
- 47 డిగ్రీలకు వరకు ఉష్ణోగ్రతల నమోదు
- రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణ శాఖ
- ఎండకు తోడు వడగాలులు
- వారంలో వడదెబ్బతో ముగ్గురు మృతి
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

మంచిర్యాలఅగ్రికల్చర్:జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. నిప్పుల వాన కురిపిస్తున్నాడు. దీంతో జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రోహిణి కార్తెకు ముందే రోళ్లు పగిలేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచే వేడి సెగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు వేడి గాలులు తోడవుతుండడంతో జనం పిట్టల్లా రాలుతున్నారు. వారం రోజుల్లో జిల్లాలో ముగ్గురు వడదెబ్బతో మృతి చెందారు. గత నెల 28న జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన మేడిశెట్టి మహేష్, 29న భీమిని మండలం చిన్నగుడిపేటకు చెందిన ఉపాధి కూలీ బాల నాగయ్య, ఈ నెల 1న జిల్లా కేంద్రంలో వృద్ధుడు బదావతి హటియా వడదెబ్బతో మృతి చెందారు.

రెడ్ అలర్ట్

45 డిగ్రీల నుంచి 47 డిగ్రీలకు చేరుకుంటున్న ఉష్ణోగ్రతలతో జిల్లాను రెడ్ జోన్‌గా ప్రకటించారు. అన్ని మండలాల్లో 45 డిగ్రీలకు చేరుకున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఎండ తీవ్రత, వడగాలుల తీవ్రత ప్రమాదకరమని, ఇప్పుడున్న పరిస్థితుల్లో బయటకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. వారం రోజుల్లో ముగ్గురు మృతి చెందగా మరో 30 మంది వరకు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు.

ప్రయాణాలు చేసేటప్పుడు...

- వాహనాలపై వెళ్లాల్సి వస్తే తల, ముక్కు, చెవులకు నిండుగా ఉండేలా కాటన్ టవల్ లేదా కర్చీఫ్ కట్టుకోవాలి. కళ్లకు చలువ అద్దాలు పెట్టుకోవాలి. గొడుగు, టోపి వెంట తీసుకెళ్తే మేలు.

లక్షణాలు..

- మనిషిలో నీటి శాతం, శరీరంలోని లవణాల సంఖ్య తగ్గిపోయి గుండె, ఊపిరితిత్తులు దెబ్బతింటాయి.
- ప్రధానంగా 60 ఏళ్లు దాటిన వారు దీని బారిన పడుతారు.
- తీవ్రమైన తలనొప్పి, కడుపునొప్పి ఉంటుంది.
- చర్మం పొడిబారడంతో నీరసంగా ఉంటుంది. పసుపు పచ్చరంగులో చిక్కటి మూత్రం రావడంతో పాటు మంటగా అనిపించడం
- సొమ్మసిల్లి పడిపోతారు. మాటలు తడబడుతాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే పిల్లలను ఆడుకునేందుకు బయటకు వెళ్లనివ్వాలి.
- వేసవిలో కాటన్ దుస్తులు ధరిస్తే సౌకర్యంగా ఉంటుంది.
- వడదెబ్బకు గురైతే తలనొప్పి, వాంతులు, శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. అత్యవసరం అనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి.
- ఎండలో తిరిగితే ముక్కు నుంచి రక్తం కారుతుంది.
- వేడి వల్ల చెమట శరీరం నుంచి వెల్లడంతో సోడియం, పొటాషియం, ఎలక్ట్రోలెవల్స్ తగ్గుతాయి. కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు, ఎలక్ట్రోపౌడర్ లేదా ఉప్పు, చక్కర కలిపిన నీటిని బాగా తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- వేసవిలో నిల్వ పదార్థాలను తినకపోవడమే మంచిది.
- అతిగా వేడి ఉన్న సమయంలో వాకింగ్, వ్యాయామం చేయక పోవడం మంచిది.
- ఏసీలో ఉండి నేరుగా ఎండలోకి వెళ్లడం, ఎండ నుంచి నేరుగా ఏసీలోకి వెళ్లడం చేయవద్దు.
- మాంసాహారం, జంక్‌ఫుడ్, ఫ్రై చేసిన కూరలు, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. షుగర్, బీపీ ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఎండకు తిరిగి వచ్చిన వెంటనే బాగా చల్లని నీరు ఒకేసారి తాగవద్దు.
- త్వరగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారం, పండ్లు, కూరగాయలు తీసుకోవాలి.
- తక్కువ మోతాదులో ఎక్కువసార్లు నీటిని తాగాలి.
- వడదెబ్బకు గురైన వారిని చల్లని లేదా నీడ ప్రదేశానికి తీసుకెళ్లాలి.
- నుదుటిపై తడిగుడ్డ వేసి తుడుస్తూ శరీర ఉష్ణోగ్రతను తగ్గించాలి.
- గాలి ఎక్కువగా తగిలేలా చూడాలి.
- నీరు ఎక్కువగా తాగించాలి.
- ముఖ్యంగా చికెన్, మటన్, బిర్యానీ, ఆయిల్ ఫుడ్, మసాల, ఫ్రై వంటివి తీసుకోరాదు.

వడదెబ్బ తగిలే ముందు...

- వడదెబ్బ తగిలే ముందు వ్యక్తి శరీరంలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని గమనిస్తే ప్రమాదం నుంచి తప్పించుకోగలుగుతాం. అందులో ముఖ్యమైనవి.
- అధికంగా చెమటపట్టి కాళ్లు, చేతులు వణుకుతాయి.
- కళ్లు మసకబారడం, కండరాళ్లు నొప్పి రావడం జరుగుతుంది.

కొడుకులు చూస్తుండగానే.. పోయిన ప్రాణాలు



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

- స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతూ కానిస్టేబుల్ మృతి
- నివాళులర్పించిన డీసీపీ అశోక్‌కుమార్



సతీష్‌గౌడ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం/నస్పూర్: తమ ఇద్దరు కుమారులకు ఈతనేర్పించేందుకు స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లిన ఆ తండ్రి అదే స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడుతూ ఊపిరాడక కొడుకుల కళ్లెదుటే మృతి చెందిన సంఘటన జిల్లాలో చోటు చేసుకుంది. నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల మేరకు గద్దెరాగడికి చెందిన పంజాల సతీష్‌గౌడ్ (41) మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో బ్లూకోర్ట్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొద్దిరోజులుగా తన ఇద్దరు కుమారులతో కలిసి సీసీసీలోని సింగరేణి స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్తున్నాడు. ఆదివారం స్విమ్మింగ్ చేస్తుండగా అధిక రక్తపోటుకు గురికావడంతో నీటిలో మునిగిపోయి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. తోటి స్విమ్మర్లు, సిబ్బంది మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు యశ్వంత్(12) వేయాన్(10) ఉన్నారు. స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న డీసీపీ

నివాళులర్పించిన పోలీస్ అధికారులు

కానిస్టేబుల్ సతీష్ మృతిని జిల్లా పోలీస్ అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. శనివారం రాత్రి తమతో కలిసి బ్లూకోర్ట్ పెట్రోలింగ్ విధుల్లో ఉత్సాహంగా పాల్గొన్న సతీష్ మృతి చెందిన వార్త తెలియగానే డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ ప్రకాశ్, ఎస్సైలు, సీఐలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆర్నెళ్లక్రితమే గృహప్రవేశం

కొత్తగా ఇంటిని నిర్మించుకున్న సతీష్ ఆర్నెళ్ల క్రితమే గృహప్రవేశం కూడా చేశాడు. కొత్త ఇంట్లోకి ప్రవేశించి ఏడాది కూడా పూర్తికాకముందే కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో మృతుని కుటుంబ సభ్యులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

కొత్త గనుల ఏర్పాటుకు కృషి చేయాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో కొత్త గనుల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం శ్రీరాంపూర్‌లో యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఆదాయ పన్ను మాఫీకి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. ఇంకా ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామనే హామీ మేరకు పెద్దపల్లి పార్లమెంట్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణకు తాము మద్దతిస్తున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, కార్మికులు కాంగ్రెస్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, రేగుంట చంద్రశేఖర్, మోత్కూరు కొమురయ్య, జోగుల మల్లయ్య, చంద్రమోహన్, అఫ్రోజ్ ఖాన్, మారుపల్లి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



ఐక్యత చాటుతున్న ప్రజాసంఘాల నాయకులు

పాతమంచిర్యాల: దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవన్‌లో 'ప్రమాదంలో ప్రజాస్వామ్యం-పార్లమెంటు ఎన్నికల్లో మన కర్తవ్యం' అనే అంశంపై ప్రజా సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా నిరంతర దాడి చేస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగానికి ప్రమాదమేనన్నారు. కులం, మతం పేరుతో భావోద్వేగాలను రెచ్చగొడుతుందని, మనమంతా ఐక్యంగా ఉండి బీజేపీ చర్యలను తిప్పికొట్టాలన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించినట్లే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాబన్న, నాయకులు రాంచంద్రారెడ్డి, బచ్చలి ప్రవీణ్‌కుమార్, గోనెల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు మునీర్, కాంగ్రెస్ నాయకులు కే.రవి, శ్యాంసుందర్ రెడ్డి, జైపాల్‌సింగ్, దేవి సత్యం పాల్గొన్నారు.

ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు



అ'పూర్వ'ం.. ఆత్మీయం

మంచిర్యాలటౌన్: శ్రీరాంపూర్‌లోని సాందీపని హైస్కూల్‌లో 2004-05 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మంచిర్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. వివిధ కారణాలతో మృతి చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన గురువులను సన్మానించారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రామకృష్ణాపూర్: 2005-06 బ్యాచ్ విద్యార్థులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 2005-06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం గద్దెరాగిడి భీమా గార్డెన్స్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. సుమారు 18 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు.

పనివేళల మార్పుపై ఏఐటీయూసీ అభ్యంతరం

శ్రీరాంపూర్: ఎండ తీవ్రత దృష్ట్యా ఓసీపీల్లో కార్మికుల షిఫ్ట్ పనివేళలు మారుస్తూ యాజమాన్యం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫస్ట్ షిఫ్ట్ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సెకండ్ షిఫ్ట్ సాయంత్రం 4 నుంచి రాత్రి 12 గంటల వరకు మార్చారు. దీనిపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆదివారం ఒక ప్రకటనలో అభ్యంతరం తెలిపారు. ఈ పనివేళలు సరిగాలేవని, దీనిపై సీఎండీ బలరాంతో మాట్లాడినట్లు తెలిపారు. ఫస్ట్‌షిఫ్ట్ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సెకండ్ షిఫ్ట్ సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రకృతివనం కంచె అపహరణ

నెన్నెల: మండలంలోని గొల్లపల్లి పంచాయతీలోని పల్లెప్రకృతివనం కంచెను ఆదివారం గుర్తు తెలియని దొంగలు అపహరించారు. లక్ష రూపాయలు విలువచేసే ఫెన్సింగ్‌తో పాటు నాలుగు సిమెంటు పోల్స్ ఎత్తుకెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి రంజిత్, ఎంపీవో శ్రీనివాస్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పండ్లు అమ్ముతూ.. ఓట్లు అడుగుతూ

బెల్లంపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆది వారం బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ తమదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంటా చౌరస్తా వద్ద పండ్ల వ్యాపారి వద్దకు వెళ్లి ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ద్రాక్ష పండ్లను తూకం వేసి అమ్ముతూ ప్రచారం నిర్వహించారు. తోపుడు బండ్ల వద్దకు వెళ్లి పండ్లను విక్రయిస్తూ ప్రచారం చేశారు.

నేటి నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ కోర్సుల 2వ, 6వ సెమిస్టర్ల పరీక్షలు ఈనెల 6 నుంచి, నాల్గవ సెమిస్టర్ల పరీక్షలు 7 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి ఆదివారం తెలిపారు. 2వ సెమిస్టర్ల పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 28, 30 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో సెమిస్టర్ పరీక్షలు 6, 8, 10, 16, 18, 21, 25, 29, 31, జూన్ 7, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటాయి. రెండో సెమిస్టర్ పరీక్షలకు 68,139, నాలుగో సెమిస్టర్‌కు 56,899, ఆరో సెమిస్టర్‌కు 46,077 మొత్తం 1,71,115 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు ఉమ్మడి వరంగల్‌లో 44, ఉమ్మడి ఖమ్మంలో 30, ఉమ్మడి ఆదిలాబాద్‌లో 49 మొత్తం 123 సెంటర్లు ఏర్పాటు చేసి 123 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించారు. ఒక్కో సెంటర్‌కు ఒక అబ్జర్వర్, వర్సిటీ పరిధిలో పది ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. హాల్‌టికెట్లు కళాశాలల వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని, కళాశాలల నుంచి పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ప్రశాంతంగా నీట్

- పరీక్షకు 1354 మంది హాజరు..
- 30 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్:వైద్య కళాశాల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన నీట్ ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5:20 గంటల వరకు జరిగిన పరీక్ష కోసం జిల్లాలో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 1,384 మంది విద్యార్థులకు 1,354 మంది హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారు. ప్రతీ సెంటర్ వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. 1: 30 తర్వాత పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. పిల్లల వెంట వచ్చిన తల్లిదండ్రులు కేంద్రాల వద్ద ఎండవేడిమి తట్టుకోలేక కనపడిన చెట్టునీడన సేదతీరారు. నీట్ ప్రశాంతంగా ముగిసిందని సిటీ కో-ఆర్డినేటర్ రేషమ్మ.ఏఎస్ తెలిపారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లిలో శనివారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి చెందాడు. ఎస్సై డీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం వేంపల్లి గ్రామానికి చెందిన ఆడె శంకరాబాయి కుమారుడు డేవిడ్ (18 నెలలు) ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కనే నిర్మాణంలో ఉన్న ఇంట్లోకి వెళ్లడంతో విద్యుత్ వైర్లను తాకి అక్కడే పడిపోయాడు. గమనించిన తల్లి కుమారుడిని పట్టుకోవడంతో ఆమెకు సైతం విద్యుత్‌షాక్ తగిలి స్పృహ కోల్పోయింది. గమనించిన గ్రామస్తులు విద్యుత్ సరఫరా నిలిపివేసి చిన్నారిని కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆడె శంకరాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.